# తోటమాలి

"హెడ్‌మాస్టరు సార్ రమ్మంటున్నారు మేడం" ప్యూను వచ్చి చెప్పగానే పిల్లలందర్నీ నిశ్శబ్దంగా వుండమని క్లాసు లీడరుని జాగ్రత్తగా చూసుకోమని చెప్పి క్లాసు వదిలి బయటకు వచ్చింది శారద. ఆమె తరగతులు మేడమీద వుంటాయి.మెట్లు దిగబోతూ గేటు వంకచూస్తే, బయటకు వెడుతున్న నీలం మారుతీ కారు కనుపించింది. అది డాక్టర్ సర్వేశ్వరరావు గారిది. వెనక సీట్లో ఆయన భార్య కామేశ్వరిగారు. ఆవిడ కాలేజీలో లెక్చరరు. ఓహో, ఆమె వచ్చినట్లున్నారు అనుకుంది శారద. వాళ్ళ పిల్లలిద్దరూ 'సృజన' స్కూలులో చదువుతున్నారు. అమ్మాయి అరుణశ్రీ ఆరో క్లాసు. అబ్బాయి ప్రవీణ్ మూడో క్లాసు, హెడ్ మాస్టర్ రమేశ్ బాబు ఒక్కరే వున్నారు రూములో. "రండి టీచర్! కూర్చోండి. ఈ ప్రోగ్రెస్ రిపోర్టు కూడికలో రెండున్నర మార్కులు తక్కువ వేశామని డాక్టరుగారి భార్య వచ్చి చూపించారు. నేను కూడా చూశాను. చిన్న తప్పు జరిగిందిలెండి. మీరుక్లాసు టీచరు కదా. మీ దృష్టికి తీసుకురావాలని పిలిచాను" అన్నారు రమేశ్ బాబు.

ఆమె రిపోర్టు తీసుకుని, ఒకటికి రెండు సార్లు మార్కులు కూడింది. నిజమే, టోటల్ తేడా వచ్చింది. "సారీ సార్!" అన్నది. రమేశ్ బాబు టీచర్లనే కాక చిన్న ఉద్యోగులను కూడా గౌరవిస్తాడు. అందరినీ కూర్చోపెట్టి మాట్లాడతాడు. అందుకని ఆయనకి ఏదైనా మాట వస్తే ఉద్యోగులంతా చాలా నొచ్చుకుంటారు. "కామేశ్వరిగారు ఏమన్నారు సార్!" అన్నది శారద. "ఏముంది? మామూలు ధోరణే! డాక్టర్ సర్వేశ్వరరావు నిదానస్తులే.కానీ ఆవిడే అగ్గి ఫైరైపోతూ మాట్లాడారు. ఇదివరకు ఒకసారి వాళ్ళ పాపకు సోషల్‌లో తక్కువ మార్కులు వచ్చాయని నాకు అరగంట ట్యూషను చెప్పి వెళ్ళారు. పిల్లలకి పాఠాలు బోధించడంలో జాగ్రత్తలు గురించి లెక్చరు యిచ్చారు" అన్నాడు రమేశ్ బాబు.

శారద నవ్వకుండా, "ఆవిడ లెక్చరర్ కదా మరి!" అన్నది. రమేశ్ బాబుకి నవ్వొచ్చింది. కానీ వెంటనే సీరియస్‌గా, "ఏమంటారు మీరు? ఈసారి ఖచ్చితంగా చెప్పేద్దాం. పిల్లలకి టి.సి. ఇస్తాం. మరో స్కూలుకి మార్చుకోమని" అన్నాడు.

"వద్దులెండి పిల్లలు అనవసరంగా బాధపడతారు. వాళ్ళ అమ్మ వచ్చి వెళ్ళినట్టు ఆ పిల్లలు చూసినట్టు లేదు. ఎందుకు వచ్చారోనని భయపడి పోతారు కాదా!" అన్నది శారద.

"పోనీండి ఈసారి ఏనివర్సరీలో పెట్టండి.. ఆ విధంగా వాళ్ళకి ప్రాముఖ్యత ఇస్తేనైనా కామేశ్వరిగారు సంతోషపడతారేమో! మీరు క్లాసు వదిలి వచ్చినట్లున్నారు వెళ్ళండి" అన్నాడు రమేశ్ బాబు. శారదకి మనస్సులో ఏమీ బాగాలేదు. చిన్నదైనా గానీ తనవల్లతప్పు జరిగినందుకు. ప్రోగ్రెస్ కార్డు సంతకం పెట్టించి అందరితో పాటు

తిరిగి ప్రవీణ్ యివ్వలేదు. అడిగితే రేపు అంటూ వాయిదా వేశాడు. ఇదన్న మాట సంగతి. ఆ పిల్లలిద్దరి క్లాసులకీ శారద వెడుతుంది. ఇంగ్లీషు, సోషల్ రెండూ చెబుతుంది. పిల్లలు తెలివిగలవాళ్ళు. మొదటి నాలుగైదు ర్యాంకుల్లోనే వుంటారు. ఇంకా ఏమిటో ఆ తల్లికి బాధ?





వాళ్ళ అమ్మ వచ్చి వెళ్ళినట్లు అటు అరుణశ్రీకి గానీ ఇటు ప్రవీణ్‌కి గానీ తెలియనివ్వలేదు. ఆరునెలల పరీక్షలు అయినాయి. మళ్ళీ మార్కులు యిచ్చారు. ఈసారి అందరి రిపోర్టుల కంటే కూడా వీళ్లవి జాగ్రత్తగా చూసి మరీ యిచ్చింది శారద.

ఎనిమిది వందల మంది పిల్లలున్న 'సృజన' స్కూలుకి ఊళ్లో మంచి పేరుంది. తెలుగు మీడియం అనేది అసలు లేకుండా పూర్తి ఇంగ్లీషు మీడియం స్కూలు. గవర్నమెంటు గుర్తింపే గానీ ఎయిడ్ లేదు. అన్ని కార్యక్రమాల్లో చక్కగా పాల్గొంటూ డి.ఇ.ఓ. గారి మెప్పు కూడా పొందుతారు.

హాఫ్ ఇయర్లీలో కూడా ప్రవీణ్ క్లాసులో ఆరో ర్యాంకువచ్చాడు. అరుణశ్రీకి రెండో ర్యాంకు వచ్చింది. అది జాగ్రత్తగా గమనించి మరీ యిచ్చింది రిపోర్టులు.

క్రిస్మసు నాలుగు రోజులు సెలవులు అయినాక స్కూలు తెరిచిన రోజు ప్రవీణ్ స్కూలుకి రాలేదు. ఆ మధ్యాహ్నం అరుణశ్రీని పిలిచి అడిగింది శారద మీ తమ్ముడు ఎందుకు రాలేదని, ఆ పిల్ల తలవంచుకుంది. జవాబు చెప్పడానికి భయపడుతున్నట్టు అర్థమైంది శారదకి. బుజ్జగించి అడగ్గా చెప్పింది "తమ్ముడికి జ్వరం వచ్చింది" అని.

"డాక్టరుగారి అబ్బాయికి జ్వరం ఏమిటి? ఏం జరిగిందమ్మా అరుణా?" అన్నది శారద. అరుణశ్రీ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"మమ్మీ కొట్టింది. ఒక రోజంతా అన్నం పెట్టలేదు. అందుకే జ్వరం వచ్చిందన్నారు డాడీ. వాడికి.... వాడికి ర్యాంకు సరిగ్గా రాలేదని కొట్టింది మమ్మీ" అన్నది.

శారద నిర్ఘాంత పోయింది. జ్వరం వచ్చేంత తీవ్రంగా కొట్టడం ఏమిటి? పసి వాడికి అన్నం పెట్టకుండా మాడ్చటం ఏమిటి అని విస్తుపోయింది. ఆ పాల బుగ్గలచిన్నవాడు కళ్ళల్లో మెదిలి ఆమె మనస్సు విలవిలలాడింది.

అరుణశ్రీ కళ్ళు తుడిచి, "ఏడవకు అరుణా! జ్వరం పోతుందిలే! మమ్మీ కూడా అంత గట్టిగా ఏమీ కొట్టి వుండరు. నేను ఫోనులో మాట్లాడుతాను" అన్నది అనునయంగా. ఆ పాప బెదిరినట్టుగా చూసి, "మీరు మాట్లాడవద్దు టీచర్" అన్నది.

ఈ మాటకి మరీ ఆశ్చర్యపోయింది శారద. "ఎందుకు వద్దు?" అన్నది. ఆ అమ్మాయి బాగా తల దించుకుని, "మమ్మీ మీకు.. మీకు... ఏమీ రాదని చెడ్డ మాటలు అంటుంది" అన్నది.

శారదకి విషయం అర్థమైంది. "సరే, మాట్లాడనులే. తమ్ముడిని బాగా చూసుకో అరుణా!" అంటూ ఆ పాపను పంపేసింది.

మధ్యాహ్నం లంచ్ టైమ్ అయిపోతోంటే హెడ్‌మాస్టర్‌గారి రూమ్‌లోకి ఎందుకో వెళ్ళింది శారద. "రండి శారదా! మిమ్మల్ని పిలుద్దామని అనుకుంటున్నాను. మీరే వచ్చారు" అంటూ ఒక కవరు చేతికిచ్చాడు రమేశ్ బాబు. ఆ కవరు మీద తన పేరే రాసి వుంది. ఏమిటిది అనుకుంటూ తెరిచి వున్న ఆకవర్లో ఏముందోనని బోర్లించగానే, ఆకుపచ్చ కాగితం ముక్కలు కిందపడ్డాయి. అది చింపి పోగులు పెట్టిన ప్రోగ్రెస్ కార్డు.

"కామేశ్వరి గారి బహుకరణ ఇది టీచర్! వాళ్ళ అబ్బాయికి ర్యాంకు సరిగ్గా రాలేదని మండిపడిపోతూ, కసిగా రిపోర్టు ముక్కలు చేసి డ్రైవరుతో పంపారు" అన్నాడు రమేశ్ బాబు. శారదకి

ఏమనాలో తోచలేదు. బాగా చదువుకొని, కాలేజీ విద్యార్థులతో మసలుతున్న ఆవిడకి అంత ఆగ్రహం ఏమిటో? తన పిల్లలు చదువులో అధమంగానైతే లేరు.

"సార్! ఆమె ఎందుకో చాలా కోపం పెంచుకున్నారు. పాపం ఆ పిల్లవాడిని ఆమె కొట్టిందట. అన్నం పెట్టలేదట. జ్వరం వచ్చిందని ఆ బాబు ఈ వేళ బడికి రాలేదు" అన్నది శారద. ఇన్నేళ్ల తన సర్వీసులో ఒక తల్లిలో అంత కాఠిన్యం ఎప్పుడూ చూడలేదు.





"పోనీ, నేను వెళ్ళివాళ్లకి నచ్చచెప్పి, ప్రవీణ్‌ని స్కూలుకి తీసుకురానా?" అన్నది శారద సందేహంగా.

"వద్దు వద్దు! మీరంటేనే ఆమెకి ఎలర్జీలాగా వుంది. నేను ఏదో వేరే పని మీద అన్నట్టు డాక్టరుగారికి ఫోను చేసి మాట్లాడుతాను. జ్వరం తగ్గాక స్కూలుకి పంపండని చెబుతాను" అన్నాడు రమేశ్‌బాబు.

ఆ తర్వాత రెండు రోజులకి ప్రవీణ్ బడికి వచ్చాడు. కారులోంచి తన తమ్ముణ్ణి దింపి, భుజం మీద చెయ్యి వేసి అక్క అరుణశ్రీ తీసుకుని రావడం చూసింది శారద. వాళ్ల ప్రేమ చూస్తే ఆమె కళ్ళు చెమర్చాయి. ఆ పిల్లలో యింత మాతృప్రేమ దాగి వుంది కదా అనుకుంది. పిల్లలను తరచి అడిగినా, పెద్దలతో గొడవ పెట్టుకున్నాగాని సంగతి విషమించి పిల్లలు బడి వదిలేసే పరిస్థితి వస్తుందని రమేశ్ బాబు అన్నాడు. శారద కూడా అంగీకరించి వూరుకొంది.

ఇంతలో వార్షికోత్సవం వచ్చింది. రమేశ్ చెప్పినట్లే శారద ఆ యిద్దరు పిల్లల్ని ప్రత్యేకంగా ఎంపిక చేసి ఒక టాబ్లోలో పెట్టించింది. ఒకరు వివేకానంద, ఒకరు మదర్ థెరిసా వేషాలు వేయాలని చెప్పి ఎంతో ప్రోత్సహించింది. వేషాలకు కావసినవన్నీ స్కూలులోనే యిస్తామనీ, ఇంట్లో ఏమీ అడగనవసరం లేదనీ చెప్పింది. మిగతా పిల్లలంతా వాళ్ళ డ్రస్సులు వాళ్ళే కుట్టించుకున్నారు. తమకి అలా ఎందుకు చెప్పారోనని అరుణశ్రీకి సందేహం వచ్చింది. కానీ ఇంగితమున్న పిల్ల. అమ్మకీ,టీచరుకీ ఏదో పేచీ వుందని గ్రహించుకుని ఏమీ అడగలేదు. ప్రవీణ్ చిన్నపిల్లవాడు. అందులోనూ అమ్మ ఆగ్రహావేశాలకు బిక్క చచ్చిపోయి వున్నాడు. టీచరు ఏమన్నాగాని తలూపుతున్నాడు.

వార్షికోత్సవానికి డాక్టరుగారు, కామేశ్వరి వచ్చారు. రమేశ్ బాబు వారిని తీసుకొని వచ్చి ముందున్న సోఫా సీట్లలో కూర్చో పెట్టాడు. సాంస్కృతిక కార్యక్రమం ఒక గంట అయినాక వార్షికోత్సవ సభ. ఆనాడు విద్యాశాఖ మంత్రి అతిథి. సభాప్రారంభంలోనే, డాక్టర్ సర్వేశ్వరరావుకి మొబైల్ ఫోను మ్రోగి ఆయన కేసు వుందని వెళ్ళిపోయారు. కామేశ్వరి పిల్లల్ని తీసుకువెళ్ళడానికి వుండిపోయింది. ఆ పిల్లలిద్దరి వేషాలకీ బహుమతులు వచ్చాయి. ఆ తల్లి ముఖంలో చింతాకులాగ చిన్న నవ్వు కనబడి శారద తేలిగ్గా వూపిరి వదిలింది.

ఆ తర్వాత బహుమతుల్లో ఇద్దరు అమ్మాయిలు తారల్లాగా వెలిగిపోయారు. చప్పట్లు, 'ఛీరప్' కేకలు ఆవరణ అంతా ప్రతిధ్వనిస్తుండగా ఆ పిల్లలు తీసుకున్న బహుమతులు చూస్తే పిల్లలకి సంబరం, పెద్దలకి ఆశ్చర్యం. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లోను,బాస్కెట్ బాల్‌లోను చిన్న పాపకి బంగారు పతకాలు! ఆమె పదవ క్లాసులో రాష్ట్రంలో రెండవ ర్యాంకు, ఇంగ్లీషులో జిల్లా స్థాయిలో, స్కూలులో అన్ని సబ్జెక్టులలోను మొదటి స్థానం. ఎన్ని సార్లు వేదిక ఎక్కి దిగుతున్నదో పిల్లలు లెక్క పెట్టేస్తున్నారు.

ఇంక వాళ్ళ అక్క ఇంటర్మీడియేటు టాపరు. అంతే కాక 'బిట్స్‌పిలానీ'లో ఇంజనీరింగు సీటు వచ్చి అక్కడికి వెళ్ళి సెలవుల్లో వచ్చింది. టెన్నీస్‌లోనూ, చదరంగంలోను ఆమె ఛాంపియన్, ఆ అక్కా చెల్లెళ్ళనిద్దరినీ చూడడానికి రెండు కళ్ళూ చాలలేదు ప్రేక్షకులకి. వందన సమర్పణ చేస్తూ రమేశ్‌బాబు శారద టీచర్‌ని వేదిక మీదకు రమ్మన్నారు. ఆ పిల్లలిద్దర్నీ చక్కగా తీర్చి దిద్దిన ఆమెకు మంత్రిగారి చేత ఒక బొకే యిప్పించారు. ఆ మెరికల్లాంటి, మెరుపు తీగల్లాంటి అమ్మాయిలు శారద సంతానం అని కొందరికి యిదివరకే తెలుసు. కామేశ్వరికి యిప్పుడు తెలిసింది.

సభ అయిపోగానే తన పిల్లలిద్దర్నీ ప్రవీణ్, అరుణశ్రీలను వెంట బెట్టుకుని శారద కామేశ్వరి దగ్గరకు వచ్చింది. "ఇదుగోండి మీ చిరంజీవులు. తమకు వచ్చిన ప్రైజులు మీకు చూపడానికి కూడా సిగ్గుపడుతున్నారు" అన్నది. వెనకాల నిలబడ్డ ఆమె కూతుళ్ళిద్దరూ కామేశ్వరికి నమస్కారం చేశారు.

వృత్తిరీత్యా లెక్చరరు అయినా, కామేశ్వరి యిప్పుడు ఏమీ మాట్లాడలేకపోయింది. కొంచెం సర్దుకుని శారద చేతులు పట్టుకుంది. "మీ అమ్మాయిలు గ్రేట్! వారికీ, మీకూ నా అభినందనలు. మీరు ఇంట్లో దిద్దవలసింది ఇద్దరినైతే, ఇక్కడ వందలాదిమందిని కంటి పాపల్లాగ కాపాడాలి. మధ్య మధ్యలో మా వంటి తల్లులు చీకాకు పెడుతుంటారు. అయామ్ సారీ! ఇదివరకు... యిదివరలో..." అంటూ ఎలా మాట పూర్తి చేయాలో తెలియనట్టు కామేశ్వరి ఆగింది.

"ఫరవాలేదండీ! ఒక్కమాట చెప్పాలనిపిస్తుంది నాకు తల్లితండ్రులతో. లేత మొగ్గలు ఆ పిల్లలు. పూర్తిగా ఎదిగి సహజంగానే వికసిస్తాయి. అందాల రంగులు, సువాసనలు రూపుదిద్దుకోవడానికి వనదేవత ఆజ్ఞ ఇస్తుంది. అప్పుడే మనల్ని మురిపిస్తాయి. ఈ లోగా తొందరపడితే పసిమొగ్గలు వసివాడుతాయి. తోటమాలి అంత ఓర్పు కావాలి మన తల్లులకి" అన్నది శారద.

అమ్మ యింత కవిత్వం మాట్లాడ్డం విని ఆమె కూతుళ్ళు, ఆ ప్రతిభా మూర్తులు చిరునవ్వుతో ఒకరిముఖం ఒకరు చూచుకొన్నారు.